


నేడు క్రిటికల్‌కేర్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 24: హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ శంకుస్థాపన పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఆస్పత్రిలో రూ.23 కోట్ల వ్యయంతో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే హిందూపురం రైల్వేస్టేషన్‌ను అమృత్‌స్టేషన్ జాబితాలో చేర్చిన నేపథ్యంలో రూ. 15 కోట్లతో మౌలిక వసతులు సమకూర్చనున్నారు. లిఫ్ట్, ఎక్సలేటర్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌లను ఏర్పాటు చేయుటకు భూమిపూజను వర్చువల్‌గా మోదీ ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, డీసీహెచ్, డీఎంహెచ్‌ఓ హాజరవుతారన్నారు.

- పురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బాలకృష్ణ
- పెనుకొండ నుంచి సవిత
- మడకశిర బరిలో దంతవైద్యుడు సునీల్‌కుమార్
- జిల్లాలో మిగిలిన మూడింటిపై ఉత్కంఠ


రేసు గుర్రాలు ఖరారు






మడకశిరలో సంబరాలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే టీడీపీ అభ్యర్థులను శనివారం ప్రకటించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. తొలి జాబితాలో టీడీపీ కంచుకోట హిందూపురం నుంచి మరోసారి సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను బరిలో దించారు. పెనుకొండ నుంచి దివంగత మాజీమంత్రి కుమార్తె ఎస్. సవిత అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం మడకశిర నుంచి మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు డాక్టర్ సునీల్‌కుమార్ పోటీలో ఉండనున్నారు. దీంతో జిల్లాలో మిగిలిన మూడింటిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అధికార వైసీపీ సమన్వయకర్తల పేరుతో హిందూపురం, మడకశిర, పెనుకొండ, కదిరి నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే శంకరనారాయణను తప్పించి ఆయన స్థానంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే మంత్రి ఉషశ్రీచరణ్‌ను దించారు. ఆమెకు దీటైన కురుబ సామాజిక వర్గం నుంచి టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా సవితను రంగంలోకి దించారు. ఈమె 2019లోనే పెనుకొండ టీడీపీ టిక్కెట్ ఆశించినా అప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యే బీకే పార్థసారధి వైపే అధిష్టానం మొగ్గు చూపిన విషయం విదితమే. ఇక టీడీపీ ఆవిర్భావం నుంచి హిందూపురం టీడీపీకి కంచుకోటగా ఉంది. వరుసగా రెండుసార్లు గెలిచిన ఎమ్మెల్యే బాలకృష్ణ మరోసారి బరిలోకి దిగనున్నారు. ఇప్పటికే ఆయన నియోజక వర్గంలో ప్రచారం ప్రారంభించారు. మడకశిరకు వైసీపీ సమన్వయకర్తగా ఈరలక్కప్పను ప్రకటించగా టీడీపీ నుంచి ఉన్నత విద్యా వంతుడైన డాక్టర్ సునీల్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు.




పెనుకొండ : సంబరాల్లో టీడీపీ అభ్యర్థి సవిత

ఆమూడింటిపై ఉత్కంఠ

టీడీపీ ప్రకటించిన తొలిజాబితాలో ధర్మవరం, పుట్టపర్తి, కదిరి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఎవరు అభ్యర్థులో తెలియక టీడీపీ, జనసేన శ్రేణుల్లో టెన్షన్ నెలకొంది. టీడీపీ-జనసేనతో కలిసి బీజేపీ వస్తుందనే చర్చసాగుతున్న నేపథ్యంలో జిల్లాలో బీజేపీ, జనసేనకు ఎక్కడ అవకాశం ఇస్తారనే చర్చ నడుస్తోంది. పుట్టపర్తి, ధర్మవరం స్థానాల్లో ఏదో ఒకటి ఇవ్వాలని జనసేన అడుగుతున్నట్లు తెలుస్తోంది. పొత్తు కుదిరితే బీజేపీ ధర్మవరం సీటును ఆశిస్తోంది. పుట్టపర్తి నుంచి తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పట్టుపడుతుండగా ఆ స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాలని టీడీపీ అధిష్టానం ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. కదిరిలో ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ప్రచారం మొదలు పెట్టారు. ఇక్కడ వైసీపీ సమన్వయకర్తగా ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని రంగంలోకి దించిన నేపథ్యంలో టీడీపీ తొలిజాబితాలో కదిరి అభ్యర్థిత్వాన్ని ప్రకటించకపోవడంతో అనిశ్చితి నెలకొంది. ఏది ఏమైనా జిల్లాలో టీడీపీ తొలిజాబితాలో గెలుపు గుర్రలకే చోటు ఇచ్చారన్న చర్చసాగుతోంది.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

కదిరి, ఫిబ్రవరి 24: వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలంటూ శనివారం అమడగూరు మండల రైతులు ఆందోళన చేపట్టారు. విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడించి, అనంతరం క్రిమిసంహారక మందులతో కదిరి, ఓడీసీ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా రైతులు శివశంకర్, బాలక్రిష్ణ, లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ వ్యవసాయానికి 7గంటలకు విద్యుత్ సరఫరా అంటున్నారే తప్ప, ఆచరణలో అమలుకాలేదన్నారు. ఇచ్చే సమయంలో పది, 15 సార్లు కరెంటు వచ్చి పోతోందన్నారు. లోవోల్టేజీ, హై లోల్టేజీలతో తరచూ మోటార్లు కాలిపోతున్నాయన్నారు. దాదాపు మూడుగంటల పాటు రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వ్యవసాయానికి 9గంటలు, అంతరాయం లేకుండా సరఫరా ఇవ్వాలని, అదికూడా పగటిపూట మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఏఈ చంద్రనాయక్ సంఘటనాస్థలానికి చేరుకుని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని వారికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్రిమిసంహారక మందుతో రోడ్డుపై రైతుల బైఠాయింపు



ఇంకెప్పుడు ఆసరా..?



నెల క్రితం బటన్ నొక్కిన సీఎం జగన్

కొత్తచెరువు, ఫిబ్రవరి 24: నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ము కోసం పొదుపు మహిళలు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు. గత నెల 23న ఉరవకొండలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి.. సీఎం జగన్ బటన్ నొక్కారు. నెల గడిచినా సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమకాలేదని మహిళలు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 23,351 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,30,927 మంది సభ్యులు ఉన్నారు. నాలుగో విడత రూ.721.6 కోట్లు మహిళల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 30 శాతం



ఉరవకొండలో ఆసరా చెక్కును అందజేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

సంఘాలకు మాత్రమే ఆసరా డబ్బులు జమయ్యాయి. చెక్కు పంపిణీ చేసి నెల గడిచినా ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడంతో మహిళలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి బ్యాంకులకు వచ్చి వెళ్లేందుకు రూ.300 నుంచి రూ.400 ఖర్చు చేయాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ దగ్గర పడుతుండటంతో సొమ్ము జమకాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మండలాలవారీగా ప్రజాప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేసి, జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఆసరా చెక్కుల గురించి గొప్పలు చెప్పుకుంటున్నారు.

వైసీపీ పని అయిపోయింది..


ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పల్లె

తిమిరికుంటపల్లిలో టీడీపీలోకి చేరిన వారితో మాజీ మంత్రి పల్లె

కదిరి, ఫిబ్రవరి 24: వైసీపీ పని అయిపోందని, కేవలం రెండు నెలల్లో ఇంటికి పోవడం ఖాయమని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. అమడగూరు మండలం మహమ్మదాబాద్ పంచాయతీ తిమిరికుంటపల్లి, సంగీతంపల్లి, పంత్రవాండ్లపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ నాలుగున్నరేళ్లకు పైగా వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అరాచకాలు, అవినీతి, దౌర్జన్యాలతోనే జగన్ పాలన సాగిందన్నారు. వైసీపీని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టేందుకు ఎదరుచూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కందుకూరి పలి కృష్ణమూర్తి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రామాంజనేయులనాయుడు, నాగేంద్రరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి 20కుటుంబాలు చేరిక

తిమిరికుంటపల్లికి చెందిన 20 కుటుంబాల వారు పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

సవితకు టిక్కెట్ పట్ల నిమ్మల హర్షం

గోరంట్ల, ఫిబ్రవరి 24: పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా సవితను ప్రకటించిన నేపథ్యంలో మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప శనివారం హర్షం వ్యక్తం చేశారు. సవిత గోరంట్లలోని తన నివాసానికి శనివారం రాత్రి రాగా, ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు. సవిత గోరంట్లకు వస్తున్న విష యం తెలుసుకుని ముందుగానే పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి స్వాగతం పలికారు. నిమ్మల నివాసంలో ముచ్చటించిన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి నిమ్మల మాట్లా డుతూ సవితకు టిక్కెట్ విషయంలో తాను అధిష్టానానికి సిఫార్సు చేయలేదన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో కురుబ సామాజిక వర్గం వారు అధికసంఖ్యలో ఉండటంతో ఆమెకు కేటాయించాలని, తాను పుట్టపర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు నిమ్మల తెలిపారు. నియోజకవర్గ ప్రజలతో సవిత మమేకమవుతున్న తీరుపట్ల అధిష్టానం సంతృప్తి చెంది ఆమెకు టిక్కెట్ కేటాయించింద న్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలన్నారు. పార్టీలో విభేదాలు లేకుండా ఐకమత్యంతో పని చేయడానికి కృషి చేయాలని సవిత కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్టణ కన్వీనర్ కక్కల రఘునాథ్‌రెడ్డి,మాజీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు


సవితకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప

ముగిసిన పాలకమండలి పదవీకాలం

కదిరి, ఫిబ్రవరి 24: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ పాలక మండలి పదవీ కాలం ఈనెల 23వ తేదీన ముగిసింది. ఈ పాలకమండలి ప్రమాణ స్వీకారం 2021 ఫిబ్రవరి 23వ తేదీన జరిగింది. దీంతో రెండేళ్ల పదవీకాలం పూర్తయింది. పాలకమండలి చైర్మన్‌గా జెరిపిటి గోపాలకృష్ణ వ్యవహరించారు. ఆయనతో పాటు సభ్యులు, సలహాదారులు రెండేళ్ల పాటు కొనసాగారు. ఇక నూతన పాలక మండలికి నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. ఈ పాలకమండలి రెండేళ్ల కాలంలో కోనేరును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయలేకపోయారు. గోశాల నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. చలపతినాయుని సత్రంలో మాత్రం కొద్దిపాటి మార్పులు చేసి గదులను వినియోగంలోకి తీసుకొచ్చారు. దానిని అమృత సదన్‌గా కొనసాగిస్తున్నారు.

చెక్‌పోస్టు పడేలోగా..!

జిల్లాలోకి అక్రమంగా మద్యం, డబ్బు

ఎన్నికల వేళ జోరుగా అక్రమ రవాణా


సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయని అధికారులు


తనకల్లు మండలం పెద్దపల్లి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

తనకల్లు, ఫిబ్రవరి 24: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడ్డాయి. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి అక్రమంగా మద్యం, నగదు తదితరాలు తరలి రాకుండా జిల్లా అధికారులు సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కదిరి నియోజకవర్గానికి కర్ణాటక రాష్ట్రం, అన్నమయ్య, కడప జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఈ నియోజకవర్గంలోని తలుపుల మండలం కడప జిల్లాకు ఆనుకుని ఉంది. ఈ ప్రాంతంలోని బట్రేపల్లి వద్ద సరిహద్దు చెక్ పోస్టు ఏర్పాటు చేయాల్సి ఉంది. నంబులపూలకుంట మండలం అన్నమయ్య జిల్లాకు సరిహద్దుగా ఉంది. ఇక్కడ కూడా జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు చేయాల్సి ఉంది. తనకల్లు మండలంలోని చీకటిమానుపల్లి వద్ద అన్నమయ్య జిల్లా సరిహద్దులో జాతీయ రహదారిపై చెక్‌పోస్టు ఏర్పాటు చేయాల్సి ఉంది. తనకల్లు మండలంలోని పెద్దపల్లి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు, అమడగూరు మండంలోని చినగానిపల్లి, అమడగూరు వద్ద, కదిరిలో సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎన్నికల సమీపిస్తున్నా అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించలేదు. ఇప్పటికే విచ్చలవిడిగా కర్ణాటక నుంచి మద్యం సరఫరా అవుతోంది. పుట్టపర్తి, హిందూపురం, మడకశిర నియోజకవర్గాలకూ కర్ణాటక సరిహద్దు ఉంది. అవసరమైన ప్రతిచోటా నిఘా వేయాల్సి ఉంటుంది. చెక్ పోస్టులను ప్రారంభించేలోగా సాధ్యమైనంత అక్రమ మద్యం, నగదు నిల్వలను జిల్లాలోకి తెచ్చుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. దీని ప్రభావం ఎన్నికలపై ఉంటుందన్నది సుస్పష్టం. స్థానిక పోలీసులు, సెబ్ అధికారులు తరచూ దాడులు చేసి మద్యానికి అడ్డుకట్ట వేయాలని చూస్తున్నారు. కానీ కట్టడి చేయలేకున్నారు. గతంలో అధికారులు జిల్లా, రాష్ట్ర సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించేవారు. దీంతో మద్యం, ఇసుక తదితరాల అక్రమ రవాణా నియంత్రణలో ఉండేది. కానీ చెక్ పోస్టులు ఎత్తివేయడంతో అక్రమాలకు గేట్లు ఎత్తినట్లు అయింది. కదిరి సబ్ డివిజన్ పరిధిలోని జిల్లా, రాష్ట్ర సరిహద్దులో త్వరలోనే చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ శ్రీలత అన్నారు.


అమడగూరు మండలంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం


నంబులపూలకుంట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం



లక్కీ నైన్..!

- టీడీపీ అధినేత చంద్రబాబు దూకుడు ● ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది అభ్యర్థుల ఖరారు
- పెనుకొండ, కళ్యాణదుర్గం, మడకశిరకు కొత్తవారు ● రాప్తాడులో పరిటాల సునీత
- రాయదుర్గంలో కాలవ ● ఉరవకొండలో ఎప్పటిలాగే పయ్యావుల కేశవ్ ● శింగనమల బరిలో మరోమారు బండారు శ్రావణి ● పురంలో బాలయ్య.. తాడిపత్రిలో జేసీ అశ్మిత్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఈసారి దూకుడు ప్రదర్శించారు. నామినేషన్ల చివరి రోజు వరకూ ఉత్కంఠ పెంచకుండా.. 'పోండి.. జనాన్ని గెలవండి..' అన్నట్లుగా అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండగా.. ఒకే రోజు ఏకంగా తొమ్మిది స్థానాలకు రేసు గుర్రాలను ఖరారు చేశారు. ఇందులో ముగ్గురు కొత్తవారు కాగా, ఇద్దరు మాజీ మంత్రులు ఉన్నారు. ఉరవకొండలో పీఏసీ చైర్మన్, సిట్టింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, హిందూపురంలో నందమూరి బాలకృష్ణ పేర్లను ప్రకటించారు. తాడిపత్రిలో జేసీ అశ్మిత్ రెడ్డి, శింగనమలలో బండారు శ్రావణిశ్రీకి రెండో చాన్స్ ఇచ్చారు. రాయదుర్గంలో ఎలాంటి సంచలనాలకు తావులేకుండా.. కాలవ శ్రీనివాసులుకు అవకాశం ఇచ్చారు. రాప్తాడుకు మాజీ మంత్రి పరిటాల సునీత పేరును ఖరారు చేశారు. కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్ర బాబు, మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు డాక్టర్ సునీల్ కుమార్, పెనుకొండలో సవిత తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం.

పురం బరిలో బాలయ్య



దివంగత ఎన్టీఆర్ నట వారసత్వాన్నే కాకుండా రాజకీయ పంథాను పుణికి పుచ్చుకున్న నందమూరి బాలకృష్ణ 2014లో రాజకీయ ప్రవేశం చేశాడు. తన తండ్రి ప్రాతినిధ్యం వహించిన హిందూపురం అసెంబ్లీ స్థానం నుంచి 2014, 2019లో వరుసగా విజయాలు సాధించారు. 2024ల్లో కూడా టీడీపీ ఆ యనను పురం బరిలో నిలిపింది. వచ్చే ఎన్నికల్లో కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని బాలయ్య అడుగులు వేస్తున్నారు.

నందమూరి బాలకృష్ణ ప్రొఫైల్

పేరు: నందమూరి బాలకృష్ణ
తల్లిదండ్రులు: నందమూరి తారక రామారావు, బసవతారకం
పుట్టిన తేదీ: 1960 జూన్ 10న చెన్నైలో జన్మించారు.
విద్యార్హత: హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో బీఏ చదివారు.
భార్య: 1982లో వసుంధరదేవితో వివాహం
సంతానం: బ్రాహ్మణి, తేజ, మోక్షజ్ఞ.
నివాసం: బంజారా హిల్స్, హైదరాబాద్
రాజకీయ రంగం ప్రవేశం: తెలుగు చలనచిత్ర రంగంలో అగ్రనటుడుగా, టీడీపీ వ్యవస్థపకుడు ఎన్టీఆర్ తనయుడుగా 2014లో హిందూపురంలో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి రాజకీయాల్లో వచ్చారు.

రాయదుర్గం కాలవకే ఖరారు



రాయదుర్గం అసెంబ్లీ స్థానానికి తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులును మరోమారు పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. 1999లో టీడీపీ తరఫున ఎంపీగా గెలిచినప్పటి నుంచి ఆయన అదే పార్టీలో క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. 2014లో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలిచి చీఫ్‌విప్, మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ప్రజా క్షేత్రంలో పార్టీ వాణిని బలంగా వినిపించారు. ప్రజా సమస్యలపై స్పందించడం, పార్టీకి విధేయులుగా ఉండటం వెరసి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గం నుంచి మరోమారు పోటీ చేసే అవకాశం టీడీపీ కల్పించింది.

బయోడేటా :

పేరు : కాలవ శ్రీనివాసులు
తండ్రి పేరు : లేట్ బాల వెంకటస్వామి
తల్లి : కె. పుల్లమ్మ **జననం:** 01-06-1964
స్వగ్రామం : కే.కే. అగ్రహారం, బుక్కరాయసముద్రం మండలం
భార్య : కే. విజయలక్ష్మి
విద్యార్హత : ఎం.ఏ సోషియాలజీ, డిప్లొమా ఇన్ జర్నలిజం
అనుభవించిన పదవులు : తెలుగు దేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, 1999 - 2004 వరకు అనంతపురం ఎంపీ, 2014 నుంచి 2019 వరకు రాయదుర్గం ఎమ్మెల్యే, 2014 - 2017 చీఫ్ విప్, 2017-2019 వరకు మంత్రిగా కొనసాగారు.

ఉరవకొండలో కేశవ్ ఏడో సారి



తండ్రి వారసత్వంగా పయ్యావుల కేశవ్ రాజకీయాల్లో ప్రవేశించారు. 1994లో టీడీపీ అభ్యర్థిగా ఉరవకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. తెలుగుదేశం పార్టీ బలమైన, ముఖ్యమైన నాయకుల్లో పయ్యావుల కేశవ్ ఒకరు. 1994 మొదలు ఇప్పటి వరకూ ఆయన ఉరవకొండ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆరుసార్లు పోటీ చేశారు. నాలుగు సార్లు గెలుపొందారు. ప్రస్తుతం ఏడో సారి కూడా టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. ఎమ్మెల్సీగా పని చేశారు. పార్టీలో వివిధ స్థాయిల్లో పదవులు నిర్వహించారు. ప్రస్తుతం పీఏసీ చైర్మన్‌గా ఉన్నారు. వైసీపీలో నెలకొన్న వర్గ విభేదాలు ఈయన గెలుపునకు కలిసి వచ్చే అవకాశం ఉంది.

పయ్యావుల కేశవ్ ప్రొఫైల్

పేరు : పయ్యావుల కేశవ్
సామాజిక వర్గం : ఓసీ (కమ్మ)
తల్లిదండ్రులు : పయ్యావుల ఓబులమ్మ, పయ్యావుల వెంకటనారాయణ
విద్యార్హత : ఎంబీఏ, **భార్య** : పయ్యావుల హేమలత

కళ్యాణదుర్గం అభ్యర్థిగా అమిలినేని



రాజకీయ ప్రస్థానం: అమిలినేని సురేంద్రబాబు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడిగా ఉంటూనే వ్యాపారం వైపు ప్రధానంగా దృష్టి సారించాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేశాడు. 2014 ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. మరి కొన్ని గంటల్లో నామినేషన్ వేయాల్సి ఉండగా... ఆయన స్థానంలో మరో అభ్యర్థిని ఖరారు చేశారు. దీంతో ఆ ఎన్నికల నుంచి తప్పుకున్న ఆయన తటస్థంగా కొనసాగుతూ వచ్చారు. క్రియాశీల రాజకీయాలు నెరపనప్పటికీ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారు.

సురేంద్రబాబు ప్రొఫైల్

పేరు : అమిలినేని సురేంద్రబాబు
తండ్రి పేరు : అమిలినేని వెంకటప్ప
తల్లి పేరు : అమిలినేని లక్ష్మీనరసమ్మ
పుట్టిన తేదీ : 22-5-1969 **స్వగ్రామం** : అమిద్యాల, ఉరవకొండ **విద్యార్హత** : బీకామ్ డిస్‌కంటిన్యూ
భార్య పేరు : అమిలినేని రమాదేవి

రాప్తాడు బరిలో మళ్లీ పరిటాల సునీత



రాజకీయ ప్రస్థానం : 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత... అప్పటి టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే అయిన పరిటాల రవీంద్రను ప్రత్యర్థులు 2005 జనవరిలో హత్య చేశారు. ఆయన మరణాంతరం 2005లో జరిగిన ఉప ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి పరిటాల రవీంద్ర సతీమణి పరిటాల సునీత టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో రాప్తాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2014 ఎన్నికల్లోనూ అదే నియోజకవర్గం నుంచి పోటీచేసి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు కేబినెట్‌లో పౌరసరఫరాలు, స్త్రీశిశుసంక్షేమ శాఖమంత్రిగా పనిచేశారు.

పరిటాల సునీత ప్రొఫైల్

పేరు : పరిటాల సునీత
తండ్రి పేరు : ధర్మవరపు కొండన్న
తల్లి పేరు : ధర్మవరపు సరస్వతమ్మ
భర్త పేరు : పరిటాల రవీంద్ర
పుట్టిన తేదీ : 28-5-1970
స్వగ్రామం : వెంకటాపురం, రామగిరి మండలం
విద్యార్హత : 10వ తరగతి

శింగనమలకు మరోసారి శ్రావణి



రాజకీయ ప్రస్థానం

బండారు శ్రావణీశ్రీ రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీలో 2015లో ప్రారంభమైంది. 2019 లో శింగనమల నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆమె పోటీ చేసి ఓడిపోయారు. అయినా కుంగిపోక జనం మధ్యే ఉంటూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఈ శ్రమే ఆమెకు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది.

బండారు శ్రావణి ప్రొఫైల్

పేరు: బండారు శ్రావణిశ్రీ
తండ్రి: బండారు రవికుమార్, విశ్రాంతి ఇన్సూరెన్స్ మేనేజర్
తల్లి: బండారు లీలావతి **పుట్టినతేదీ:** 3-08-1990
స్వగ్రామం: బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం గ్రామం **విద్యార్హత:** మాస్ కమ్యూనికేషన్స్ ఇన్ జర్నలిజం

పెనుకొండ బరిలో సవిత



పెనుకొండ టీడీపీలో చురుకైన నాయకురాలిగా గుర్తింపు పొందారు సవిత. ఈమె తండ్రి దివంగత ఎస్. రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పని చేశారు. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని టీడీపీలో ఉంటూ ప్రజాసేవా కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తున్నారు. గత టీడీపీ హయాంలో రాష్ట్ర కురుబ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్‌గా ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈమెది కురుబ సామాజిక వర్గం కాగా, భర్త కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. దీంతో బీసీలతో పాటు కమ్మ సామాజిక వర్గం వారు కూడా సవిత గెలుపునకు సహకరిస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సవిత ప్రొఫైల్

పేరు: సవిత **కులం:** కురుబ
ఊరు: వజ్రాలపేట, పెనుకొండ పట్టణం, శ్రీసత్యసాయి జిల్లా.
భర్త : వెంకటేశ్వరరావు జననం: 15-01-1977
విద్యార్హత: బి.ఎ **వృత్తి:** వ్యాపారం, రాజకీయం

తాడిపత్రిలో జేసీ అశ్మిత్‌రెడ్డి



రాజకీయ ప్రస్థానం : తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి వారసత్వంతో జేసీ అశ్మిత్‌రెడ్డి 2014లో రాజకీయ రంగప్రవేశం చేశారు. తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో 2014లో 34వ వార్డు కౌన్సిలర్‌గా పోటీచేసి గెలుపొందారు. మొట్టమొదటిసారిగా 2019 ఎన్నికల్లో తాడిపత్రి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూశారు.

పేరు : జూటూరు చిన్న అశ్మిత్‌రెడ్డి
తల్లిదండ్రులు : జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ ఉమారెడ్డి **స్వస్థలం** : తాడిపత్రి
పుట్టిన తేదీ : 16-05-1983
భార్య పేరు : అఖిలా రెడ్డి
విద్యార్హత : చెన్నైలో మెకానికల్ ఇంజనీరింగ్, లండన్ ఆంగ్ర్యూస్ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ మార్కెటింగ్

తండ్రి బాటలో తనయుడు..



తండ్రి మద్దనకుంట ఈరన్న రాజకీయ వారసత్వానికి కొనసాగింపుగా డాక్టర్ సునీల్‌కుమార్ తెలుగు దేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తండ్రి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా వెరవకుండా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి టీడీపీ తరపున పోరాటం చేస్తున్నారు. ఈక్రమంలోనే పార్టీ అధిష్ఠానం ఆయన చొరవను గమనించి 2024 ఎన్నికల్లో మడకశిర(రిజర్వుడ్)అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరపున పోటీ చేసే అవకాశం కల్పించింది.

పేరు : డాక్టర్ సునీల్ కుమార్ **పుట్టినతేదీ** : 20-06-1991
భార్య : సారిక **గ్రామం** : మద్దనకుంట,
మండలం: అమరాపురం
నియోజకవర్గం : మడకశిర
తండ్రి : మద్దనకుంట ఈరన్న
తల్లి : శివమ్మ **విద్యార్హత** : బ్యాచ్‌లర్ ఆఫ్ డెంటల్

నేడే గ్రూప్-2 పరీక్ష

అనంతపురం టౌన్, ఫిబ్రవరి24 : ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-2 పోటీపరీక్ష ఆదివారం జరగనుంది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. ఈపరీక్షలకు 32,391మంది అభ్యర్థులు హాజరవుతుండగా, జిల్లా వ్యాప్తంగా 111పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు సీనియర్‌జిల్లా అధికారులు 38మందిని రూట్ ఆఫీసర్లుగా నియమించారు. 111మంది మండలస్థాయి అధికారులను లైజన్‌ఆఫీసర్లుగా నియమించారు. పరీక్ష ఉదయం 10-30గంటలనుంచి మధ్యాహ్నం 1-00గంటవరకు కొనసాగనుంది. నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించమని కలెక్టరు వెల్లడించారు. అభ్యర్థులు ఉదయం9-30గంటల నుంచి 10గంటలలోపే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 10-15గంటలవరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఆతర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకేంద్రంలోకి అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు ఏదైనా గుర్తింపుకార్డుతో హాజరు కావాలన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య వచ్చినా, అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నా కంట్రోల్‌రూమ్ 08554-220009 నెంబరుకు ఫోన్‌చేసి పరిష్కరించుకోవచ్చని కలెక్టరు సూచించారు.

అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 24 : శ్రీ సత్యసాయి జిల్లాలో గ్రూపు-2 పరీక్షలు రాసేందుకు వెళ్లే అభ్యర్థులకు ఆయా సెంటర్లకు ఆదివారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీపీటీఓ మధుసూదన్ తెలిపారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 8839మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షలు రాయనున్నారని అన్నారు. ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సి ఉందన్నారు.

గుత్తి రైల్వే జంక్షన్‌కు మహర్దశ



గుత్తి, ఫిబ్రవరి24: గుత్తి రైల్వే జంక్షన్‌కు మహర్దశ కలగనుంది. జంక్షన్‌లో ప్రయాణికులు పడుతున్న కష్టాలను రైల్వే బోర్డు గుర్తించింది. దక్షిణ మధ్య రైల్వేలో 15 రైల్వేస్టేషన్లు 'అమృత్ భారత్' స్కీం కింద ఎంపికయ్యాయి. అందులో గుత్తి రైల్వే జంక్షన్ కూడా ఈనెల 26న అమృత్ భారత్ స్కీంను ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. పథకంలో భాగంగా రూ. 10 కోట్లతో పలు అభి వృద్ధి పనులు చేపట్టనున్నట్లు సీనియర్ డివిజన్ ఇంజనీర్ సంజీవ్‌కుమార్, రైల్వేస్టేషన్ మేనేజరు సురేష్‌బాబు, ఐఓడబ్ల్యు అధికారి నాగేశ్వర నాయక్‌లు తెలిపారు. స్టేషన్ బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ మీనా కుమారి పరిశీలించారు.

గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని 16 స్టేషన్ల అభివృద్ధికి కేంద్రం నిధులను కేటాయించింది. త్వరలో దేశవ్యాప్తంగా అమృత్ స్టేషన్లు, వంతెలన నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారని అధికారులు తెలిపారు. అందులో భాగంగా ద.మ. రైల్వే జోన్‌కు 1,800 కోట్లు లభించనుండగా, గుంతకల్లు రైల్వే డివిజన్‌లో 12 స్టేషన్ల అభివృద్ధికి, ఆర్ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణానికి నిధుల కేటాయింపు జరిగినట్లు పేర్కొన్నారు. అనంతపురం రైల్వే స్టేషన్‌కు రూ.20.71 కోట్లు, గుత్తి స్టేషన్‌కు రూ.17.13 కోట్లు, తాడిపత్రి స్టేషన్‌కు రూ.7.68 కోట్లు, డివిజన్‌లోని ఆదోని స్టేషన్‌కు రూ.10.26 కోట్లు, కంభం స్టేషన్‌కు రూ.7.14 కోట్లు, డోన్ స్టేషన్‌కు రూ.13.13 కోట్లు, ధర్మవరం స్టేషన్‌కు రూ.8.64 కోట్లు, కడప స్టేషన్‌కు రూ.9.5 కోట్లు, మదనపల్లె రోడ్డు స్టేషన్‌కు రూ.8.01 కోట్లు, మంత్రాలయం రోడ్డు స్టేషన్‌కు రూ.3.58 కోట్లు, నడికుడి స్టేషన్‌కు రూ.11.3 కోట్లు, నంద్యాల స్టేషన్‌కు రూ.10.6 కోట్లు, పాకాల స్టేషన్‌కు రూ.7.28 కోట్లు, శ్రీకాళహస్తి స్టేషన్‌కు రూ.11.79 కోట్లు, రాజంపేట రైల్వే స్టేషన్‌కు రూ.5.93 కోట్లు, చిత్తూరు రైల్వే స్టేషన్‌కు రూ.13.99 కోట్లు కేటాయించారు.

శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి

- నిందితులను అరెస్ట్ చేయాలి ● బెస్త సేవా సంఘం నాయకుల డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24 : సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ బెస్త శ్రీ కృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని బెస్త సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణపై దాడికి వ్యతిరేకంగా నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, గౌరవాధ్యక్షుడు చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, బెస్త సేవా సమితి రాష్ట్ర డైరెక్టర్ చేపల హరిలు మాట్లాడుతూ.. సాక్షాత్తు సీఎం జగన్ సభలోనే ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై వైసీపీ మూకలు విచక్షణ రహితంగా దాడి చేసి చంపేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. బీసీలపై వైసీపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. దాడి జరిగి ఆరు రోజులు కావస్తున్నా ఇప్పటి దాకా ఒకరిని మాత్రమే అరెస్టు చేసి, మి గతా వారిని వదిలేయడం దారుణమన్నారు. దాడి చేసిన మూకలను పోలీసులు గుర్తించినప్పటికీ అధికార పార్టీ నేతల ఒత్తిడులతో అరెస్టు చేయకపోవడం దేనికి సంకేతమని నిలదీశారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం తోపాటు తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవా సంఘం నాయకులు శీనా, నాగార్జున, కుళ్లాయప్ప, సుబ్బరాం ప్రసాద్, రమేష్, నారాయణస్వామి, బీసీ సంఘం రాయలసీమ యూత్ ప్రెసిడెంట్ జస్వంత్ వ్యాస్, నవీన్, వెంకీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలో పాల్గొన్న బెస్త సేవా సంఘం నాయకులు



కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేస్తూ..

27న మహిళలకు ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24: మొబైల్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో ఖాళీల భర్తీకి మహిళలకు ప్రత్యేక ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. ఈనెల 27న నగరంలోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన మహిళలు అర్హులన్నారు. కోలార్‌లోని ప్రముఖ మొబైల్ సంస్థలో నెలకు రూ.20వేల వేతనంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హతగల మహిళలు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9513822234ను సంప్రదించాలని కోరారు.

బైక్ రిపేరీలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24: టూవీలర్ మెకానిజమ్ బైక్ రిపేరీపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తామని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువత అర్హులన్నారు. 45రోజుల పాటు శిక్షణలో ఇంగ్లీష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 939050 5952, 7780752418లను సంప్రదించాలని కోరారు.

మార్పు రాకపోతే ఇంక్రిమెంట్స్ కట్ ...!

- సిబ్బందికి ఏపీ మోడల్ స్కూల్స్ జేడీ హెచ్చరిక



మాట్లాడుతున్న జేడీ వెంకట క్రిష్ణారెడ్డి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 24 : ఏపీ మోడల్ స్కూళ్లలో మార్పు కనిపించాలని, ఫలితాలు, అడ్మిషన్లు పెరగాలని, ఇదే తరహా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే...ఇంక్రిమెంట్ కట్ చేస్తామని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం నగర శివారులోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు జి ల్లాల ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, సబ్జెక్ట్ టీచర్లతో 10వ తరగతి, ఇంటర్ మీడియట్ గత ఏడాది ఫలితాలు, 2024 పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వరలక్ష్మి, సీబీఎస్ఈ కోఆర్డినేటర్ శ్రీలత, ఏఎంఓ ధర్మకుమార్, అసిస్టెంట్ ఏఎంఓ శరత్ బాబు, మోడల్ స్కూల్ ఏడీలతో కలసి సమీక్ష చేశారు. అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని అన్ని మోడల్ స్కూళ్లలో విద్యార్థుల ఉత్తీర్ణతపై, తరగతులు, సబ్జెక్టుల వారీగా సమీక్షించారు. కొన్ని స్కూళ్లలో గత ఏడాది 10వ తరగతి, ఇంటర్‌లో దారుణమైన ఫలితాలు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాళ్లు, టీచర్లు క్షేత్రస్థాయిలో తిరిగి అడ్మిషన్లు పెంచాలని, లేకపోతే స్కూళ్లు తొలగించే ప్రమాదం ఉందన్నారు. సొంత పిల్లల్లాగా భావించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సిబ్బంది, నాలుగు జిల్లాల మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పప్పుశనగ విక్రయానికి పేర్లు నమోదు చేసుకోండి

- ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24 : జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి పప్పుశనగ విక్రయం కోసం రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పప్పుశనగ క్వింటాల్ మద్దతు ధర రూ.5,440లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న పీఎం కిసాన్, సున్నావడ్డీ డబ్బులు విడుదల

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24: పీఎం కిసాన్, సున్నా వడ్డీ డబ్బులను ఈనెల 28న ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతులకు ఈ ఏడాదికి సంబంధించి మూడో విడత పీఎం కిసాన్ సొమ్ము, 2021-2022 రబీ, 2022-2023 ఖరీఫ్‌కు సంబంధించి సున్నా వడ్డీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారన్నారు.



చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం



ధర్మవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు



తాడిమర్రి మండలం పిన్నదరిలో..

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 24: ప్రజా సంక్షేమం చంద్రబాబు తోనే సాధ్యమని మున్సిపల్ మాజీ చైర్మన్ బీరేగోపాలకృష్ణ, టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిశేసుధాకర్ పేర్కొన్నారు. పట్టణం లోని 25వ వార్డులో శనివారం వారు టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఆయనతోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకులు గడ్డం సూరి, చీమలరామాంజి, క్లస్టర్ రామాంజినేయులు, గంగాధర్, శ్రీనివాసులు, రవి, పోతలయ్య, అమర్‌నాథ్, కృష్ణ, చిరంజీవి, జనార్దన్, సూరి, శీలామూర్తి, గడ్డం కుళ్లాయప్ప, మాధవరెడ్డి, బడిగింజలరమణ, కరెంటు ఆది, తెలుగుమహిళలు స్వర్ణకుమారి, మున్ని, శారద, మీనాక్షి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి/ బుక్కపట్నం/ బత్తలపల్లి: తాడిమర్రి మండలం పిన్నదరిలో టీడీపీ నాయకులు బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. వాటికి సంబంధించిన కరపత్రాలు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌తో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కపట్నం మండలకేంద్రంలోని బైపాస్‌రోడ్డులో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. మినీమేనిఫెస్టో పథకాల గురించి ఇంటింటా తిరిగి వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నిరకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. సామాన్యులు కడుపు నిండా భోజనం చేయలేని దుస్థితిలో ఉన్నారన్నారు ఈ పాలనకు స్వస్తి పలకాలని ప్రజల్ని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నారాయణస్వామి, శ్రీరాములు, చెన్నప్ప, విజయ్, పీట్ల రమణ, తదితరులు ఉన్నారు.

ఇక బత్తలపల్లిలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు, గంటాపురం జగ్గు, తాళ్లూరి సాంబ, మండల శ్రీనివాసులు, నారాయణస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బుక్కపట్నంలో..



బత్తలపల్లిలో..

బడుగుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం: కందికుంట



పట్నంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కందికుంట వెంకటప్రసాద్

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 24: బడుగు, బలహీనవర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పట్నం గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. మహిళలు, యువత పెద్దఎత్తున స్వాగతం పలికారు. తర్వాత కందికుంట ఇంటింటికీ తిరుగుతూ చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని బలపరచి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. బడుగులు టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెన్నకేశవులు, నాయకులు హరి, కృష్ణమూర్తి, శంకర్, అహమ్మద్‌వలి, రాజు, చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 24: కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో పలువురు వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరారు. గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో దాదాపు 20కుటుంబాల వారు వైసీపీనీ వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పర్వీన్‌భాను, గంగులప్ప, ప్రేమలత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కందికుంట

పల్లె సెల్ఫీ చాలెంజ్



సెల్ఫీ చాలెంజ్‌లో దెబ్బతిన్న రోడ్డును చూపుతున్న పల్లె

కదిరి, ఫిబ్రవరి 24: అమడగూరు మండలం శీకిరేవులపల్లి గ్రామంలో శనివారం మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పర్యటించారు. ఈ క్రమంలో ఆ గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో సెల్ఫీ చాలెంజ్ ద్వారా ప్రభుత్వంపై మండిపడ్డారు. ఏళ్ల గడుస్తున్నా.. రోడ్డు ఎందుకు మరమ్మతులకు నోచుకోలేదని ప్రశ్నించారు. గడిచిన నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదనడానికి ఈరహదారే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

కన్నులపండువగా చెన్నకేశవుడి తడక మహోత్సవం

బుక్కపట్నం, ఫిబ్రవరి 24: మండలంలోని చెంద్రాయునిపల్లి గ్రామంలో కొండల్లో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం తడక మహోత్సవాన్ని సంగిం వంశస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా మాఘ పౌర్ణమి సందర్భంగా తడక మహోత్సవం నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఈసందర్భంగా తొలుత ఆలయంలోని చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత తడక మహోత్సవాన్ని జరిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఫిబ్రవరి 24: జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అమరావతి నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తిలోని కలెక్టరేట్ నుంచి వీసీలో కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొని జిల్లాలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షల ఏర్పాట్లు, మూడో విడత భూసర్వే, ఇనాము, అసైన్డ్ భూములు, గృహనిర్మాణశాఖ, ఉపాధిహామీ, తాగునీరు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితరాలపై సమగ్రంగా వివరించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, వైద్యం, కుటుంబ సంక్షేమంపై కూడా కలెక్టర్ వివరించారు.

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 24: నిబంధనలు పాటించని పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ (ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్) నాయకులు శనివారం ఎంఈఓ చెన్నకృష్ణకు వినతిపత్రం అందించారు. పలువురు మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కాకనే నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నారని తెలిపారు. అలాగే అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాలల్లో నోటు, పాఠ్యపుస్తకాలు విక్రయించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ.. పట్టించుకోకుండా పాఠశాల యజమాన్యం పుస్తకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అట్టగడుతున్నారని వాపోయారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నరసింహులు, కిరణ్‌దేవ్, పృధ్వీరాజ్; ప్రదీప్ తదితరులున్నారు.

ఓటుహక్కుపై యువతకు అవగాహన

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని దిగువచెర్లోపల్లిలో శనివారం టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ కొత్తగా ఓటు హక్కు పొందిన యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. తొలిసారిగా వేయనున్న ఓటును టీడీపీకి వేయాలని కోరారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, బాగా ఆలోచించి ఓటు వేయాలని, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే చంద్రబాబునే ఎన్నుకోవాలని తెలిపారు. అనంతరం మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ అనే పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు వాల్మీకి శ్రీరాములు, విజయ్, రమణ, నారాయణస్వామి, మధు, జనార్దన్, కుమార్, గణేష్, రమేష్, అంజినాయుడు, వెంకట్రాముడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు క్రమం తప్పకుండా మందులు వాడాలి

● డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 24: క్రమం తప్పకుండా మందులువాడితే క్షయవ్యాధి నినయం చేసుకోవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. మండలంలోని పైపల్లిలో సర్పంచు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన గురువారం క్షయ లక్షణాలు.. నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. సమయానికి క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయవ్యాధి నయమవుతుందన్నారు. క్షయవ్యాధిని 2025 సంవత్సరంలోగా దేశంనుంచి నిర్మూలించే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రెండువారాలకు పైగా దగ్గు, గళ్లలో రక్తం పడడడం, అనూహ్యంగా బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి రావడం, రెండువారాలకు మించి జ్వరం ఉండడం మొదలగు లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి వైద్యపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. తద్వారా ఆరోగ్యకరమైన జీవితం గడపడానికి వీలు కలుగుతుందన్నారు. క్షయతో బాధపడే వారు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సెల్వియాసాల్మన్, క్షయ నిర్మూలన జిల్లా అధికారి తిప్పయ్య, పీపీఎం కోఆర్డినేటర్ నాగమణి, సీహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, అబిద్‌బాషా, టీబీహెచ్‌వీ రాజేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి



ధర్మవరంలో ముస్లిం కుటుంబానికి యాసిన్ సూర ఫొటోను అందజేస్తున్న మైనార్టీ నాయకులు



ముదిగుబ్బలో పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు..

ధర్మవరం , ఫిబ్రవరి 24: తెలుగుదేశం పార్టీతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ హిందూపురం పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ పేర్కొన్నారు. పట్టణంలోని 27వ వార్డులో గల ముస్లిం కుటుంబాలకు శనివారం ఆయన మైనార్టీ నాయకులతో కలిసి యాసిన్‌సూర ఫొటోలను పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి వాటిని అందజేశారు. అనంతరం నాగూర్‌హుస్సేన్ మాట్లాడుతూ.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అందేవన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పథకాలన్నంటినీ రద్దుచేసిందని తెలిపారు. పథకాలు మళ్లీ కొనసాగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఇందుకు ముస్లింలు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అత్తార్ రహీంబాషా, మైనార్టీ నాయకులు రాళ్లపల్లిషరీఫ్, సలీంబాషా, ఉస్మాన్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని రైల్వేగేటు కొట్టాలలో గల ముస్లిం కుటుంబాలకు టీడీపీ నాయకులు యాసిన్ సూరా ఫొటోలను పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి వాటిని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మలమనోహర్, నాయకులు అమీర్‌బాషా, షబ్బీర్, బషీర్, దాదావలి, అబ్బు, అజ్మీర్, రామాంజి, ప్రతాప్, పుల్లప్ప, చిన్నవెంకటేష్, నంద తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు



గరుడవాహనంపై కొలువుదీరిన లక్ష్మీచెన్నకేశవ స్వామి

ధర్మవరం, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో శనివారం సాయంత్రం లక్ష్మీచెన్నకేశవ స్వామిని గరుడ వాహనంలో వైభవంగా ఊరేగించారు. తెల్లవారుజామున అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భానుప్రకాశ్, చక్రధర్‌లు ఆలయంలోని మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం గరుడ వాహనంపై స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నా రు. అన్నమయ్యసేవామండలి సభ్యులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. గోదారంగనాథ మహిళా మండలి సభ్యులు కోలాటం ఆడారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జ రిగే విధంగా సాంప్రదాయ పద్ధతిలో గరుడ వాహన సేవ నిర్వహించామ ని ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టిసుబ్రమణ్యం, ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలు

ఘనంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

తనకల్లు, ఫిబ్రవరి 24: మండలంలోని కడపలవారిపల్లి గ్రామంలో శనివారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితులు తొలుత స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణమహోత్సవాన్ని వైభవంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకను తిలకించి తీర్థప్రసాదాలు పొందారు. కార్యక్రమంలో కడపవారిపల్లి గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

రమణాశ్రమంలో మాఘ పౌర్ణమి వేడుకలు

ధర్మవరం, ఫిబ్రవరి 24: పట్టణంలోని రమణ మహర్షి ఆశ్రమంలో మాఘమాస పౌర్ణమి వేడుకలను శనివారం ఆశ్రమ వ్యవస్థాపకుడు చిప్పలవెంకప్ప ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలో అరుణాచల మహాదీపాన్ని స్వచ్ఛమైన ఆవునెయ్యితో వెలిగించారు. అనంతరం భక్తులచేత అక్షర మణమాల పారాయణం చేయించారు. తర్వాత లోక కల్యాణార్థం యాగం చేశారు. అలాగే సత్సంగ కార్యక్రమం, నారాయణసేవ జరిపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తిమ్మమ్మ మర్రిమానును సందర్శించిన సోమేష్‌కుమార్

నంబులపూలకుంట, ఫిబ్రవరి 03: మండలంలోని గూటిబైలు గ్రామంలో గల ప్రపంచ ప్రసిద్ధిగాంచి తిమ్మమ్మ మర్రిమానును తెలంగాణ మాజీ చీఫ్ సెక్రెటరీ సోమేష్‌కుమార్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. ఆయన గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. ఆ సమయంలో తిమ్మమ్మ మర్రిమాను సమీపంలోని అటవీ ప్రాంతంలో శివ ప్రాజెక్టును నిర్మించారు. ఈప్రాజెక్టును ఇప్పుడు ఆయన పరిశీలించారు. అలాగే తిమ్మమాంబ, బాలవీరయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టూరిజం గైడ్ మనోహర్ తిమ్మమ్మ మర్రిమానుజీవిత చరిత్రను వివరించారు. శివ ప్రాజెక్టుకు రంగులు వెలిశాయని టూరిజం గైడ్ ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. రంగులు వేయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గాండ్లపెంట తహసీల్దార్ శ్రావణి, డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్, వీఆర్వోలు పాల్గొన్నారు.



తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతంలో సోమేష్‌కుమార్ తదితరులు

20వ వార్డులో యశోదమ్మ ప్రచారం



20వార్డు ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కదిరి, ఫిబ్రవరి 24: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెం కట ప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ శనివారం పట్టణంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. స్థానిక 20 వార్డులో ప్రతి ఇంటికీ తిరుగుతూ మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఆమెకు వార్డులో ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. కౌన్సిలర్ వెంకటరమణమ్మ, పర్వీన్‌బాను, ఉమాదేవి, ప్రేమలత, గంగరత్నమ్మ, కార్యకర్తలు ఉన్నారు.

వైసీపీ ఇసుక దోపిడీ: టీడీపీ



ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి, ఫిబ్రవరి 24: వైసీపీ నాయకులు ఇసుక అక్రమ రవాణా ద్వారా కోట్లు సంపాదించారని, ఇప్పుడు ఆ డబ్బుతో వచ్చే ఎన్నికలలో ఎలాగైనా గెలవాలని చూస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. మండలంలోని నల్లబోయనపల్లి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద శనివారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందన్నారు. ఆ పార్టీ ముఖ్య నాయకులు ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో రూ. కోట్లు కొల్లగొట్టారని అన్నారు. పేదలు ఇళ్ల కట్టుకునేందుకు కూడా ఇసుక దొరకని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ దోపిడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మండలకన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు, సు రేంద్రనాయుడు, మందల శ్రీనివాసులు, క్రిష్టయ్య, గరిశనపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ శీర్షిక పుస్తకావిష్కరణ

తనకల్లు, ఫిబ్రవరి 24: జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు ఆరుద్ర శ్రీనివాస్ సొంతంగా అంబేడ్కర్ శీర్షిక అనే పుస్తకాన్ని తయారు చేయించారు. రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడానికి సరళంగా కార్టూన్లతో పుస్తకం ముద్రింపజేశారు. ఆ పుస్తకాన్ని డీఎస్పీ శ్రీలత శనివారం కదిరిలోని తన కార్యాలయంలో విడుదల చేసినట్లు ఆరుద్ర శ్రీనివాస్ తెలిపారు. ఈ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎస్సీఎస్టీ బీసీ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పిల్లలకు రాజ్యాంగంపై అవగాహన, అంబేడ్కర్ సేవలను తెలియజేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై కళాజాతా

గాండ్లపెంట, ఫిబ్రవరి 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జనజాగృతి వారు హెచ్ఐవీ నిర్మూలనపై కళాజాతా రూపంలో అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శనివారం వారు ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ అంటువ్యాధి కాదని.. అంటించుకునే వ్యాధి అని అన్నారు. వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వ్యాధి సోకితే మందులు ఎలా వాడాలో తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి మారుతీ మహేశ్వర్, సూపర్ వైజర్లు ఉపేంద్రరెడ్డి, విజయ్, జనజాగృతి కదిరి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఓఆర్ డబ్ల్యు నిర్మల, పిఇఎస్ శైలజ, ఉషారాణి తదితరులున్నారు.

చలో గుత్తి కరపత్రాల విడుదల

ధర్మవరం, ఫిబ్రవరి 24: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 28న గుత్తిపట్టణంలో సితార కల్యాణమండపంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరగనుందని, అందరూ పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లాఉపాధ్యక్షుడు సిరిడిబూదెప్ప, జిల్లా సహాయక కార్యదర్శి గజ్జల రామాంజనేయులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని జగ్జీవన్‌రాంనగర్‌లో శనివారం చలో గుత్తి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గుత్తిలో జరిగే ఉమ్మడిజిల్లా కార్యకర్తల సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందక్రిష్ణ మాదిగ హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ గౌరవాధ్యక్షుడు గజ్జల శివప్రసాద్, నాయకులు పవన్‌కుమార్, కామరాజు, నరసింహులు, నితీశ్‌కుమార్, పెద్దన్న, చంద్రశేఖర్, కీర్తన, రామ్మూర్తి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాకే బదిలీలు చేపట్టాలి

పుట్టపర్తి, ఫిబ్రవరి 24: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను రేషనైజేషన్ పద్ధతిలో బదిలీలను చేయడం సరైంది కాదని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బాబా ఫక్రుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు పరీక్షలు జరిగే తరుణంలో బదిలీలు చేపట్టడం ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను విడుదల చేయాలని, పేస్కేల్‌ను రికార్డ్ అసిస్టెంట్ స్థాయి నుంచి సీనియర్ అసిస్టెంట్ స్థాయికి మార్పు చేయాలని , జాయినింగ్ తేదీ నుంచి రెగ్యులర్ చేస్తూ అరియర్స్ చెల్లించాలని, ప్రతి సచివాలయం ఉద్యోగికి ప్రమోషన్ కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

గ్రామాల్లో సాగిన బీజేపీ ప్రజాపోరుయాత్ర

నంబులపూలకుంట, ఫిబ్రవరి 24: బీజేపీ చేపట్టిన ప్రజా పోరుయాత్ర శనివారం మండలంలోని వడ్డిపల్లి, వెలిచెలమల, రామాపురం, గౌకనపేట, జౌకల, దిన్నెమీదపల్లి, తూర్పు నడింపల్లి, నల్లగుట్టపల్లి, మరికొమ్మదన్నె గ్రామాల్లో కొనసాగింది. పలువురు నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వేణుగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు రామమోహన్, ఇంతియాజ్, గురివిరెడ్డి, మోహన్‌రెడ్డి, రమణ, వెంకటేష్, తలుపుల గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా శివుడి విగ్రహ ప్రతిష్ఠ



వెంకటగిరిపాళ్యంలో ప్రతిష్ఠించిన శివుడి విగ్రహం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 24 : మండలంలోని వెంకటగిరిపాళ్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామంలోని పాత శివాలయాన్ని గ్రామస్థుల సహకారంతో జీర్ణోద్ధరణ చేశారు. రెండు రోజుల నుంచి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయంలో శనివారం ఆలయంలో శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాల్లో మాఘపౌర్ణమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో కస్తూరి రంగనాథస్వామి

గోరంట్ల, ఫిబ్రవరి 24: మండలంలోని శివాలయాలతో పాటు ప్రధాన ఆలయాల్లో మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోరంట్లలోని సోమేశ్వర ఆలయం, వానవోలు, బూదిలి గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కస్తూరి రంగనాథస్వామి ఆలయంలో ఆకుపూజ చేసి, మాఘవాస వ్రతం ఆచరించారు. సోగరాళ్లలోని ఆంజనేయస్వామి ఆలయంలో భజనలు, పూజలు, అన్నదానం నిర్వహించారు.

గ్రూపు-2 పరీక్షలకు సర్వం సిద్ధం

పెనుకొండ, ఫిబ్రవరి 24 : స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఆదివారం జరగబోయే గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి శనివారం తెలిపారు. పరీక్షా కేంద్రానికి 300మంది అభ్యర్థులను కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరుఐడీ, పాన్‌కార్డ్ లాంటి వాటిలో ఏదైనా ఒక ఐడీ తప్పక తీసుకురావాలని తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 24: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సీడాప్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఎస్‌ఆర్‌టీపీ స్కిల్ కళాశాలలో యువతీ యువకులకు ఉపాధి అంశాలకు సంబంధించి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్కిల్ కోఆర్డినేటర్ లక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తిగల యువతీ యువకులు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణలో రీటైల్డ్ సేల్స్ సూపర్‌వైజర్, కంప్యూటర్ , స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ కాలం లో వారికి యూనిఫాం, భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక ఉపాధి కల్పిస్తారన్నారు. ఆసక్తిగల యువత సోమవారం నుంచి ఈ నెల 29వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వయసు 18 నుంచి 26 సంవత్సరాలుండాలన్నారు. ఇంటర్ పాసై ఉండాలన్నారు. శిక్షణ కాలం నాలుగు నెలల ఉంటుందన్నారు. ఇతర సమాచారం కోసం ఫోన్ నం. 7989479371కు సంప్రదించాలన్నారు.

ఇంటికి నిప్పు



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మడకశిర రూరల్, ఫిబ్రవరి 24 : మడకశిర పట్టణంలోని హిందూపురం రోడ్డు సమీపంలో ఉన్న రాము అనే వ్యక్తి ఇంట రాత్రి 10.45 గంటలకు మంటల చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామానులన్నీ కాలిపోయాయి. దీంతో రూ. లక్షవరకు ఆస్తి నష్టం వాటిలినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. రాత్రి పూట ఆకతాయులు సమీప కంప చెట్లకు నిప్పు పెట్టారు. మంటలు రగులుకుని ఇంటికి వ్యాపించాయి. ఇలు తగలబడి పోతుంటే చుట్టుపక్కల వారు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వెంటనే మంటలను అదుపుచేశారు. రాము కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అగ్నిప్రమాదం జరిగిన ఇంట్లో గతంలో ఆ కుటుంబీకులు ఉండేవారు. ప్రస్తుతం వేరేఇంట్లో ఉంటున్నారు. ఈ ఇంట్లో పగలంతా కార్పెంటర్ పనులు చేసి, సాయంత్రానికి వెళ్లి పోతారు. దీంతో ఎటువంటి ప్రాణాపాయం జరుగలేదు. దీంతో చుట్టుపక్కల ఇళ్లలోని వారి ఊపిరిపీల్చుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని సిద్ధిగిరి గ్రామానికి చెందిన హనుమంతప్ప కుమారుడు గిరి (45) జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి కే పాళ్యం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడినట్లు మృతుడి బంధువులు శనివారం తెలిపారు. వారందించిన వివరాల మేరకు.. మృతుడు గిరి బెంగళూరులోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఉండేవాడు. అక్కడే ఉన్న ఓ యువతితో పరిచయం ఏర్పడి, ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆమె గత నాలుగు రోజులు కిందట మృతి చెందడంతో గిరి జీవితంపై విరక్తి చెందాడు. స్వగ్రామానికి వచ్చి కే పాళ్యం గ్రామ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం



పురవీధుల్లో సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో స్వామి ఉత్సవ మూర్తి

- భక్తజన సంద్రమైన ఆలయ ప్రాంగణం
- మార్మోగిన గోవింద నామస్మరణ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 24: రెండో తిరుపతిగా పేరు గాంచిన హిందూపురంలోని పేట వేంకటరమణస్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూ కట్టారు. రథోత్సవం సందర్భంగా మూలవిరాట్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అలాగే అనాది సంప్రదాయం ప్రకారం పట్టణంలోని కొల్హాపురి లక్ష్మీదేవిని ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి అప్పగించే కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా స్వామి వారి రథోత్సవం లాగే తాడు, చక్రాల కిందకు ఉపయోగించే ఆయుధాలను తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ఉత్సవ విగ్రహాలను బ్రహ్మ రథంలో ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. గోవింద నామ స్మరణతో పరిసర ప్రాంతం మార్మోగింది. వేల మంది భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. కొరియన్ భక్తురాలు ఒకరు స్వామి వారిని దర్శించుకొని కొబ్బరి కాయ కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్, బాలాజీ సేవా సమితి, శ్రీకృష్ణ భజన మండలి, సత్యసాయి సేవా సమితి, కోట ప్రాంత ప్రజల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అదే విధంగా మజ్జిగ, నీటి పాకెట్లు అందించారు. కేరళ వాయిద్యాలు, డప్పుల మోత, యువత కేరింతలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, సమన్వయకర్త శ్రీనివాసరావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్, రాష్ట్ర నాయకుడు కొల్లకుంట అంజనప్ప, నాయకులు నాగరాజు, జెపికె రాము, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివ శంకర్, అమర్‌నాథ్, రాయల్‌గోపాల్, వైటీపీ వెంకటరమణ, నాని, మంగేష్, హెచ్‌ఎన్ రాము, రాఘవేంద్ర, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



ఊరేగింపుగా వస్తున్న కొల్హాపురమ్మ



పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు



అన్నదానం చేస్తున్న భక్తులు

పెనుకొండ టీడీపీ అభ్యర్థిగా సవిత.. సంబరాలు



పెనుకొండంలో సంబరాలు చేసుకుంటున్న యువత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 24 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను శనివారం ప్రకటించిన నేపథ్యంలో... పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థిగా కురుబ సామాజికవర్గానికి చెందిన సవితను ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సవిత తొలుత మాజీ మంత్రి ఎస్ రామచంద్రారెడ్డి స్వగ్రామం కొండంపల్లిలోని ఆయన సమాధివద్ద నివాళులర్పించారు. అనంతరం పెనుకొం డలోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. పెద్దఎత్తున కార్యకర్తలు, నాయ కులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె పట్టణంలో చాదర్‌ను తలపై ఎత్తుకుని ర్యాలీగా వెళ్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వ హించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో సవిత మాట్లాడుతూ... అధికార పార్టీ అరాచకాలు, తెలుగుదేశం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. టీడీపీ, చంద్రబాబు, నారా లోకేశ్, అచ్చెన్నాయుడు తనను గుర్తిం చి నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణం ఉన్నంతవరకు పార్టీకోసం కష్టపడతానని రెండు రోజుల్లో నాయకు లందరినీ ఒప్పించి ముందుకెళ్తానని అన్నారు. ఏ ఒక్క టీడీపీ నాయకుడు, కార్యకర్త మనసు నొప్పించేలా ప్రవర్తించనని, అందరికీ అందుబాటులో ఉంటా నని, రెండు రోజుల్లో కార్యచరణ సిద్ధం చేసుకుని ప్రజల్లోకి వెళ్తానన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా యువత, కార్యకర్తలు, నాయకులు కార్యాలయానికి చేరుకుని ఆమెను పూలమాలలు, శాలువలతో సత్కరించారు. సవిత విజయానికి కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గుట్టూరు సూరి, సోము, నాయకులు బాబుల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, మైనార్టీ నాయకుడు దాదు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: సవితను పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడంతో గోరంట్లలో పార్టీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నాయి. గోరంట్లలోని వినాయక ఆలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కూడలిలో బాణసంచా పేల్చుతూ సవితమ్మ నాయ కత్వం వర్ధిల్లాలని నినాదాలుచేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కక్కల రఘునాథ్‌రెడ్డి, నిమ్మల శ్రీధర్, బాలక్రిష్ణచౌదరి తదితరులున్నారు. అలాగే పాలసముద్రం గ్రామంలో టీడీపీ నాయకులు బస్‌స్టాప్ వద్ద టపా సులు పేల్చి టీడీపీకి జైకొడుతూ సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజేష్‌నాయక్, కట్టుబడి ఆంజి, సుబహాన్, రామలింగారెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, పోతన్న, శివారెడ్డి, బాబా, అశోక్, నరేష్ తదితరులు ఉన్నారు.



పాలసముద్రంలో బాణసంచా పేల్చుతున్న టీడీపీ నాయకులు

మడకశిర అభ్యర్థిగా సునీల్.. ప్రకటనపై హర్షం



మడకశిరలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 24 : తెలుగుదేశం పార్టీ మడకశిర నియోజకవర్గం అభ్యర్థిగా డాక్టర్ సునీల్ కుమార్ పేరును ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయడు ప్రకటించడంతో టీడీపీ, జనసేన పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న మాట్లాడుతూ.... ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యం కల్పించాలన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉద్దేశంతోనే తన కుమారుడు సునీల్‌కు పార్టీ అధిష్ఠానం టికెట్ కేటాయించిందని పేర్కొన్నారు. తెలుగుదేశంపార్టీకి సంబంధించి నియోజకవర్గంలో ఎలాంటి గ్రూపులు లేవన్నారు. పార్టీ అన్న తర్వాత చిన్న చిన్న సమస్యలు ఉంటాయన్నారు. వాటిని పెద్దగా పట్టించుకోకుండా పార్టీలోని అందరూ ఐక్యమత్యంతో పనిచేసి విజయం సాధించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని తెలిపారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావలసిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు. తర్వలో జరుగునున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో విజయం సాధించి అధికారం చేపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

పెనుకొండ తమ్ముళ్ల ఆవేదన

పెనుకొండ/రొద్దం, ఫిబ్రవరి 24: పెనుకొండ టిక్కెట్ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి కేటాయించకపోవడంతో ఆయన వర్గీయులు ఆగ్రహించారు. పార్టీ జెండాలు, బ్యానర్లను దహనం చేసి నిరసన తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పెనుకొండ టీడీపీ కార్యాలయానికి శనివారం తరలి వచ్చారు. కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీలలను తొలగించారు. కరపత్రాలను రోడ్డుపై పడేసి నిప్పు పెట్టారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న బీకే పార్థసారథిని చుట్టుముట్టి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయం గురించి బీకే స్పందించకుండా వెళ్లిపోయారు. రొద్దం మండల పరిధిలోని నాగిరెడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తలారి నాగరాజు విద్యుత్ స్తంభం ఎక్కి నిరసన తెలిపారు. బీకే పార్థసారథికి టిక్కెట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

గుండుమల వర్గం అసంతృప్తి

మడకశిర టౌన్, ఫిబ్రవరి : టీడీపీ నియోజకవర్గం అభ్యర్థి ఖరారు విషయంలో నియోజకవర్గం ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అభ్యర్థిగా డాక్టర్ సునీల్ కుమార్ పేరును అధినేత ప్రకటించడంతో నియో జకవర్గం వ్యాప్తంగా ఉంటున్న గుండుమల వర్గం శనివారం గుండుమల తిప్పేస్వా మి ఇంటి వద్దకు చేరి, ఆయనతో చర్చించారు. మూకుమ్మడిగా పార్టీ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధ పడ్డారు. గుండుమల తిప్పేస్వామి నివాసం ముందున్న చంద్రబాబు ఫ్లెక్సీలను తొలగించి పలువురు నిరసన వ్యక్తం చేశారు.

క్షయ నివారణకు క్రమం తప్పక మందులు వాడాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 24: క్రమం తప్పకుండా మందులువాడితే క్షయవ్యాధి ని నయం చేసుకోవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. మండలంలోని పైపల్లిలో సర్పంచు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన గురువారం క్షయ లక్షణాలు.. నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. సమయానికి క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయవ్యాధి నయమవుతుందన్నారు. క్షయవ్యాధిని 2025 సంవత్సరంలోగా దేశంనుంచి నిర్మూలించే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రెండు వారాలకు పైగా దగ్గు, గళ్లలో రక్తం పడడం, అనూహ్యంగా బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి రావడం, రెండువారాలకు మించి జ్వరం ఉండడం మొదలగు లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు.

రహదారి ఆక్రమణకు వైసీపీ నాయకుడి యత్నం

- అడ్డుకున్న స్థానికులు
- ఇరువర్గాల ఘర్షణ



స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తున్న అహ్మద్‌నగర్ వాసులు

హిందూపురం, ఫిబ్రవరి 24 : పట్టణంలోని అహ్మదనగర్‌లో రహదారి స్థలాన్ని శుక్రవారం రాత్రి వైసీపీ నాయకుడు ఆక్రమించేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. వైసీపీ ముఖ్యనేత వద్ద ఉన్న పట్టణానికి చెందిన ఓ నాయకుడు రహదారికి సంబంధించిన మూడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకునే ఉద్దేశ్యంతో శుక్రవారం రాత్రి ఎక్స్‌కవేటర్‌తో చదును చేసేందుకు వెళ్లాడు. దీనిని స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే వైసీపీ నాయకుడు కొందరు బయటి వ్యక్తులను తీసుకొచ్చి స్థానికులపై ఉసిగొలిపారు. ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. కానీ ఇక్కడ రహదారి స్థలాన్ని ఆక్రమిస్తే ఊరుకునేది లేదని స్థానికులు అన్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను పంపించి వేశారు. అయితే ఈ సందర్భంలో ఒకరిద్దరికి స్వల్పగాయాలయ్యాయి. దీనిపై ఫిర్యాతు చేసేందుకు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికులు పోలీస్ స్టేషన్ వద్దే పడగాపులు గాశారు. కానీ పోలీసులు మాత్రం పేట వెంకటేశ్వరస్వామి రథోత్సవం బందో బస్తులో ఉన్నందున ఆదివారం దీనిపై మాట్లాడతామని చెప్పినట్లు స్థానికులు తెలిపారు. వైసీపీ నాయకుడు ఆక్రమించుకున్న స్థలం రూ.20లక్షలకు పైగా ఉంటుందని స్థానికులు తెలిపారు.

శనీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం



శనీశ్వరస్వామి రథోత్సవంలో భక్తుల రద్దీ

పావగడ, ఫిబ్రవరి 24: ప్రసిద్ధిగాంచిన పావగడ శనీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం వేలమంది భక్తుల నడుమ వైభవంగా సాగింది. మధ్యాహ్నం గం.12.15 ని.లకు జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథంలో ఉంచి ఊరేగించారు. భక్తులు రథంపైకి అరటిపళ్లు, సాంబ్రాణి విసరి మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామస్మరణతో రథోత్సవ సాగింది. ఈ సందర్భంగా భక్తులు తమ జోలికి రావద్దంటూ స్వామికి విన్నవించుకున్నారు.

మైలార లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

అగళి, ఫిబ్రవరి 24 : మండలంలోని మధూడి గ్రామంలో వెలసిన మైలార లింగేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఉదయం కలశపూజ, హోమాలు ఉత్సవ మూర్తి ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మహా మంగళహారతి, పూరాహుతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో మైలార లింగేశ్వరస్వామి



హోమంలో పూర్ణాహుతి వేస్తున్న భక్తులు

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

పెనుకొండ, ఫిబ్రవరి 24 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థుల చేత సరస్వతి పూజ చేయించారు. పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులు సరస్వతిదేవిని వేడుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



సరస్వతిపూజ చేస్తున్న విద్యార్థులు

ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డు ఏర్పాటు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 24: స్థాని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సొంత నిధులతో పట్టణంలోని 25వ వార్డులో సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. 25వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కోరిక మేరకు ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో రోడ్డును ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పట్టణంలో రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయలేదని, వార్డులో చిన్నచిన్న పనులకు కూడా నిధులు మంజూరు కాలేదని ఎమ్మెల్యే బాలయ్యకు కౌన్సిలర్ వివరించారు. దీంతో ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ. 50 వేల అందించారు. దీంతో శనివారం టిప్పుఖాన్ స్ట్రీట్‌లో సీసీ రోడ్డు వేసి ప్రజలకు అనుకూలించేలా చేశారు. రోడ్డు ఏర్పాటు చేసినందుకు ప్రజలు ఎమ్మెల్యే, కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

రాంపురంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం



రాంపురంలో శుభ్రత పనులు చేపడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 24 : మండలంలోని రాంపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించినట్లు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 పీఓ కాంతారావు తెలిపారు. ఈసందర్భంగా ఈనెల 23నుంచి 29వరకు రాంపురం పంచాయతీ గ్రామాల్లో ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా శుభ్రత పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగానే శనివారం రాంపురం పాఠశాల ఆవరణంలో శివాలయం చుట్టూ పరిసరాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు, చెత్తాచెదారం తొలగించి శుభ్రతా పనులు చేపట్టినట్లు తెలిపారు.

గోరంట్ల: మండలంలోని శిరగంవాండ్లపల్లిలో ఎస్‌వీఎం డిగ్రీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శనివారం శ్రమదానం చేశారు. ప్రిన్సిపాల్ భక్తవత్సలం ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధులను, మురుగునీటి కాలువలను విద్యార్థులు శుభ్రం చేశారు. ప్రతి ఇంటికెళ్లి పరిశుభ్రత, పర్యావరణం గురించి వివరించారు. సీజనల్ వ్యాధుల నుంచి బయట పడడానికి కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోకూడదన్నారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ ఎస్ పీఓ బాలమోహన్, అధ్యాపకులు జునిడిబాషా, రఘునాథ్‌రెడ్డి, విద్యార్థులున్నారు.

అశ్వమేధ బస్సుల ప్రారంభం

పావగడ, ఫిబ్రవరి 24: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తియోజన పథకం కింద ఐదు బస్సులను పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ శనివారం ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు స్థానిక నూతన బస్టాండ్‌లో ఐదు కొత్త కేఎస్ ఆర్టీసీ అశ్వమేధ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పావగడ నుంచి తుమకూరు - బెంగళూరు మార్గాన ఈ బస్సు సర్వీసులను ప్రారంభించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పావగడ నుంచి మంత్రాలయం, తిరుపతి, ధర్మస్థలం తదితర పుణ్యక్షేత్రాలకు త్వరలో బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ఆయన పలు ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి, ప్రారంభోత్స వం చేశారు. శనీశ్వరస్వామి పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్